సీరియల్ నవల:

# సత్యాగ్రహము

విశ్వనాథ సత్యనారాయణ

★

అది మలకలవాగు.

అది వర్షాకాలం.

అది అడవి.

అది ఒక అడవి పల్లె సమీప ప్రదేశం, చుట్టూ కొండలు.

వర్షాకాలం కాని ఆ వాగులో ఎప్పుడూ నిండా నీళ్ళు ఉండవు. ఏతావతా ఆ వాగు పుట్టిన దిమ్మెల్లోపు, ఆ పరిమెళ్ళ ఎగువన వాన కురవటమేమిటి యిక్కడికి రావటమేమిటి, నీళ్ళు యిక్కడనుంచి వెళ్ళిపోవటమేమిటి అంతా గంటల మీద పని. అంటే ఆ వాగులో ఎప్పుడూ నీళ్ళు ఉండవన్నమాట.

ఆ పల్లెటూరిలోని పశువులు కాని కొంచెపిల్లవాళ్ళు కాని వాగు వచ్చిందంటే పదినిమిషాలు పరకాయించి చూస్తారు. తర్వాత యథేచ్ఛంగా వెళ్తారు.

ఈ వాగుసంగతి పిల్లవాళ్ళకు మాత్రమే తెలియటం ఏమిటి పసువులకూ తెలుసు. పులులు మాత్రం పశువులు కావూ వాటికీ తెలుసు. ఆవులకూ ఎడ్లకూ దున్నపోతులకూ గేదెలకూ మేకలకూ ఉన్నంత తెలివి పెద్దపులుల కుండదా?

అట్టే మాట్లాడితే వాటికింకా ఎక్కువ తెలివి ఉంటుంది.

అదేమిటయ్యా మనుష్యులలో తిరిగే జంతువులవియూరెు, మనుష్యులతో సంబంధం లేని జంతువులవియూరెు, తెలివి వీటి కెక్కువ ఉండాలిగదా అంటారేమో! తెలివి అంటే మనిషికే ఉంటుందనా మీ ఉద్దేశ్యం. మనిషి ఎలా ఊహిస్తాడో అలా ఊహిస్తేనే తెలివి అనా?

మనిషి మాత్రం యెల్లప్పుడూ ఒకేమో సరిగానే ఊహిస్తాడా? మనిషంటే ఒకటేనా ఏమిటి? అవయవ సంఘటనాత్మకమైన ఒక ఆకారవిశేషాన్ని బట్టి మనుష్యులందరు ఒకజాతి గనుక మనిషి అంటే జాతివాచకం గాని వాడి జ్ఞానము గాని జాతి గుణము కాదు స్వభావము కాదు. తెలివితేటలనేవి జాతి ఆశ్రయించి ఉండవు.

అందుచేత తెలివిని కొలవాలంటే దానికి వేరే కొలతబద్ద కావాలి. సరే యిప్పుడవన్నీ యెందుకు?

చెప్పదలచిందేమంటే ఆ వాగులక్షణం ఈ పశువులకంటే ఆ పెద్దపులులకు బాగా తెలుసు.

తెలుసంటే యేమిటంటే వాగు జర్రున వచ్చిందంటే ఆ గడియో రెండుగడియలో దానిదగ్గరకు పోకూడదురా అని పశువులకు తెలుసు.

ఈ తెలివితోపాటు కొంత తెలివితక్కువ కూడా ఉంది. ఏముంది? కాసేపట్లో వాగు తీసే

స్తుంది ఆవతలికి పోదామని అక్కడే ఉంటై ఆ పశువులు.

కాదయ్యా వాగు దాటితేనే అడవి ఉంది. ఇక్కడే పచ్చిక ఉంది అని ఉందా? వాగుదాటితే పెద్దఅడవి ఉన్నమాట నిజమే. పల్లెను అంటు కున్నది అడవి కాకపోలేదు. అక్కడ పచ్చికా లేకపోలేదు. ఆ పశువులూ అలాగే ఆ పెద్ద అడవి లోకి పోతాయ్. ఈ పశువుల కాపర్లూ ఆ పశు వుల్ని పెద్ద అడవిలోకి తోలుకొనిపోతారు.


అసలు జంతుస్వభావమే ఇది యేమో!

మామిడిపండ్లు కొనటానికి బజారు పోతామను కోండి ఒకచోట రాశిపోసి ఉంటుంది. ఒక డజను కొంటే ధర అదే. ఆ కాయల్లో అది పెద్ద ఇది చిన్న అనే యేర్పాటు చేయటం చాలా కష్టం అయినా అది యేమి వ్యామోహమో ఆ కాయ మార్చి యీ కాయ, ఈ కాయ మార్చి ఆ కాయ కనీసం ఒకసారి అయినా రెండుసార్లయినా చేయ కుండా కొనుక్కొచ్చే పెద్దమనిషి యెవరు?

ఆ కొనే ఆయన మీరూ నేనూ కాదు. ఒక జమీందారనుకొందాం. ఒకమంత్రి అనుకొందాం. కాదయ్యా వేదాంతశాస్త్రం అంతా తుదముట్ట చదివిన పండితుడనుకొందాం. అరే అంత పండితు డాయె ఆయనకుకూడా వ్యామోహముంటుందా అనుకుంటారేమో? ఆ పండితులు ఊరికే పుస్తకా లల్లో ఉన్న విషయం మాత్రం తెలిసినవాడైతే పెద్ద విచారించనక్కరలేదు కాని అనుభవశాలి అయితే కొంచెం విచారించాలి. నిజానికి అంత అనుభవశాలి అయితే కాంతా కాంచనములందు వైరాగ్యం కుదుర్తుందేమో? మామిడిపండ్లు కొనటంలో మాత్రం వైరాగ్యం కుదరదు.

ఏమిటయ్యా రహస్యం అని అడుగుతారు. ఇది మూలప్రకృతి. అది చావదు. అది చస్తే మామిడి పండ్లు కొనటానికే రాడు. విశేష విషయాలల్లో భావనచేసి అభ్యాసంచేసి ఇంద్రియ నిగ్రహం సంపాదిస్తాడు. అల్పవిషయాలుకూడా నియమి తాలు కావాలన్న ఊహ చెయ్యడు.

అందుచేత జంతుస్వభావం మోహంవైపుకే లాగుతుంది. నీవు కొంచెం పెద్ద పండేమో అని వ్యామోహ పడ్డట్టుగా అక్కడి పచ్చిక ఇంకొక అంగుళం పెరిగి ఉందని ఆ పశువు వ్యామోహ పడుతుంది. ఆ పశువువైపున వాదిస్తే మేడ అంత వంచనక్కరలేదు అది యెక్కువ సుఖవు అని పశు తాభిమానులు అనవచ్చు.



అక్కడ యెక్కువగా పచ్చిక ఉన్నది అక్కడకు వెళ్ళటం అజ్ఞానమేమిటి అంటారు. అజ్ఞానమంటే అసంతుష్టి. ఇక్కడ ఉన్న పచ్చికతో సంతుష్టపడరాదూ? ఎందుకు పడాలి అంటే ఆ అడవిలోకి పోతే యెన్నిసార్లు పొంచిఉండి యీ పశువుల్లో దేన్నో ఒకదాన్ని పెద్దపులులు వేసుకొనిపోయినవి కావూ?

ఈ పశువేమో ఆ కొండమలుపు తిరిగి ఆ పొద వెనుకకు పోయి ఆ పులి దీన్ని పట్టుకొని వేసుకపోయిందయ్యా ఈ పశువు అరవటానికైనా వీలైందా? అది పడుతూనే మెడపైనుంచి గొంతుక నరాలు పట్టుకొనె. దీని కంఠంలోని అంభారవము అక్కడే అణగిపోయె.

ఎవరికైనా దూరాన్నుంచి చూస్తే తెలిసింది లేకపోతే సాయంత్రం లెక్కలో తక్కువైతే తెలిసింది.

వేసుకోపోయే పులి యెట్లాగూ వేసుకపోతుంది వాగు దాటకపోతే మాత్రం ఆగుతుందా అంటారా? అదేమి మాట

గడచిన పదిసంవత్సరాలనుకోండి ఈ పదిసంవత్సరాలల్లో వాగు ఇవతల చచ్చిపోయిన గొడ్లెన్ని? అవతల చచ్చిపోయినవెన్ని? ఊరికి దగ్గర అంతకంటె భద్రం కదా? అని యెవళ్ళో చెప్తాము ఆ సంగతి.

ఆ ఊరివాళ్ళకన్న మనకెక్కువ తెలుసునా? నిన్న పులి వేసుకపోయిందాయె. ఇవ్వాళ మళ్ళీ తోలిరి. మొండితనం గూడా వైరాగ్యమా? అవశ్యంగా కాపాడటానికి వీలులేదా యేమిటి?

సరే పశువులకున్న తెలివితక్కువ ఆ పులులకున్న తెలివిగా ప్రకాశిస్తుంది.

ఇదివరకెన్నిసార్లు జరిగింది వాగు ఇల్లా తీయగానె మందగా ఈ పశువులన్నీ గబగబా వాగు అవతలకు దాటిపోవటం?

వాగు దాటగానే అన్నీ చిన్నచిన్న గుట్టలు, ఏ పశువు ఏ గుట్టవెనుకకు పోయినా పెరచోట్లకి కనబడకపోవటం ఆ వేళకి. ఆ పులి వెనక్కువచ్చి మాటోస్తటం. ఒకదాన్ని వేసుకపోవటం, ఇది ఇట్లా జరుగుతూనే ఉన్నది.

కాదు అవశ్యంగా పశువుల్ని వేసుకొని పోతయ్యా పులులు. అంతే మనుష్యులనూ వేసుకోపోవటం ఉందిగా. భేదమేమిటయ్యా అంటే పశువులను వేసుకపోతే తక్కువ అల్లరి. మనుష్యులను వేసుకపోతే ఎక్కువ అల్లరి.

ఆ పులులకు ఇంత తెలివితేటలు ఎక్కడనుంచి వచ్చినై? అట్టే విచారిస్తే పశువుల్ని చంపితేనే గాని దాని బ్రతుకు గడవదు. కనుక దాని ఊహ అంతా పశువులని చంపటంమీదనే ఉంటుంది. అందుచేత ఆ క్రౌర్య విషయంలో దాని తెలివి తేటలముందు ఈ పశువులేమి పనికిరావటం లేదు. ఈ పశువుల కాపర్లు అంతకంటే పనికిరావటం లేదు.

ఆ పులుల్ని చంపటం మానేశారా అంటే మానివెయ్యలేదు. చంపటం అంటే విసుగెత్తి అనేక ప్రయత్నాలుచేసి ఎన్నాళ్ళకో ఒకదాన్ని చంపటం. ఇల్లా ఎన్నింటిని చంపితే ఉన్న పులులన్నింటినీ చంపటానికి వీలు.

ఎప్పటికైనాసరే పులి అనేది లేకుండా సృష్టిలో చేస్తావా?

ఓ చేస్తాము ఆ జాతి జాతి నామమాత్రావశేషంగా చేస్తాము మరి చెయ్యలేదా?

ఆఫ్రికాలో ఎంత చేశామో, అమెరికాలో ఎంత చేశామో, ఆస్ట్రేలియాలో ఎంత చేశామో ఇంక ఈ హిందూదేశంలో చెయ్యలేమూ?

పెద్దపులీ అనే జంతువే సృష్టిలో లేకుండా చేస్తామా? ఎంచేస్తే? బలే బాగుండే.

భగవంతుడు దాన్ని ఎందుకు సృష్టించాడో? ఇందులో ఇదొక ప్రశ్నయా!

అది కాదయ్యా పులివేట ఒక సరదా. అది ఒక నేర్పు. అదొక విద్య. పులే లేకపోతే పులివేట యెలా? ఆ వేటలో అతడు గొప్పవాడు అని అనిపించుకోటం ఎలా? పులిని వేటాడటంమూలంగా ఒక శౌర్యం ఒక ధైర్యం కొన్ని వీరలక్షణాలు మనిషిలో ఏర్పడతై. ఆ లక్షణాలకు దోహదం ఇచ్చేది పులివేట. అందుచేత పులివేట ఉండవలసిందే. అందుచేత పులీ ఉండవలసిందే. అంటే పులిని నిర్మూలంగా చెయ్యరాదు.

అసలు ఇంకోటి చూచారా?

అడవిలో ఒక పులులే ఉన్నై అంటారా? లేళ్లు ఉన్నై. దుప్పులు ఉన్నై. అనేక జంతువులున్నై. పులులు లేకపోతే ఈ లేళ్లు దుప్పులు కోటానకోట్లుగా పెరిగి గడ్డి పైరును మిగలనిస్తయ్యా! అందుచేత లేళ్లను చంపేందుకు పులులుండాలసిందే. సరే పులులను పూర్తిగా చంపకూడదు.

మరి పులులు ఊళ్ళమీదికి రాకూడదే. అన్ని పులులూ వస్తున్నై కనుకనా? వచ్చినప్పుడు చంపుదాం. అరే పులి వచ్చింది అది అక్కడ ఆ పశువుని వేసుకొనిపోయింది ఇక్కడ యీ స్త్రీని చంపుతుంది అని పది పదిహేనుసార్లు గగ్గోలు పుట్టినతర్వాత కాని దాన్ని చంపాలని నీ మనసొప్పటం లేదాయె.

అనుకున్నతర్వాత నీవు నిజంగా చంపటానికి బయలుదేరటానికి కొన్నాళ్లు పట్టె. కాదయ్యా నీవు బయలుదేరి అడవిలోకి వెళ్ళడంతోటే ఇదిగోనయ్యా చంపు అని అదివచ్చి ఎదురుగుండా కూర్చుంటుందా?

నీవు దాని జాడలు తీయాలి మాటు పెట్టాలి కొరికితే దొరుకుతుంది లేకపోతే లేదు.

మరి యింతకాలము రెండురోజుల కొకసారో మూడురోజుల కొకసారో దానికి ఆహారం కావాలిగా. ఒక గొడ్డునో ఒక మనిషినో వేసుకపోతుంది.

ఓరి బాబోయ్ ఇదేమి పాలించటమయ్యా చచ్చినవాళ్లు చావగా మిగిలినవాళ్లను రక్షిస్తావా? నీకు పులిమీద యెక్కువ ప్రేమా? మనుష్యుల మీద ఎక్కువ ప్రేమా?

ఆ పులి ఇల్లా చేయగా చేయగా పోలీసువారు వచ్చారు. అధికార్లు వచ్చారు. పరవ తోలించారు. దొరగారు చెట్టుమీద మాటు పెట్టారు, మీరందరూ కలిసి ఆ పులిని ఆ చెట్టుక్రిందగా తోలండి. వారు ఒక తుపాకిదెబ్బకు దాన్ని చంపేస్తారు.

పరవ తోలేటప్పుడు పులి బెదిరి జనంమీదకెదురుతిరుగుతుందనుకోండి ఇంక పరవ తోలే జనం సంగతి చెప్పారు!

ఆహా ఏమి పులివేట? ఏమి ప్రజారక్షణ? ఏమి మూలభూతమైన అజ్ఞానము?

ఈ అజ్ఞానాన్ని ఆశ్రయించి క్రూరజంతువులు ఎంతచక్కగా పొట్టపోసుకుంటున్నై. అవి క్రూర

# ప్రణవ గీతి

చేవూరు సింహాచలం

★

మాలతీ సుమజానా!
మార్గమధ్యమునందు
విరతావి వెదజల్లి
దరిజేరకున్నావు
చిగురు జొంపాలలో
చిక్కుకొన్నావా?
అందకుండగ భ్రమ
నాకసంబున నిల్చి
నరసినంతనె మబ్బు
తెరమాటుకే బోయి
లక్ష్యమే లేకుండ
మరలిపోతావా?
విరులెల్ల పీడవా
కళలెల్ల కరుగవా
మరులెల్ల నిలమనా
కాలంబు గడపదా
గీతలో వ్రాతలో
హృదయాల పేటిలో
నిలచిపోయేదాక
నిలకడే లేదా?

---

జంతువులవటూ మనుష్యులు వాటిని తెలుసుకోలేక ప్రమత్తులై వాటి నోళ్లలోకి ఎలా వెళ్తున్నారో, ఈ మనుష్యుల్ని పాలించే ప్రభువులు అధికార్లు వీళ్ళని ఎంత బాగా పాలిస్తున్నారు?

ఆ పల్లె పేరు దానవాయిపాలెం.

అది అడవిలో ఉంది.

ఆ ఊరిలోనూ గాచరికమువారు వెళ్ళి పన్నులు వసూలు చేస్తారు.

పన్నులు వసూలుచేయటం ఎందుకో తెలుసునా? "మీకు వచ్చే సర్వాపదలనుండీ మిమ్మల్ని రక్షిస్తామని అర్థం.

ఆ వాగు ప్రవహిస్తూనే ఉంది.

అటు పశువులు ఇటు పులులు.

—(ఇంకా వుంది)